హరితహారం చెట్లు నరికివేత

మాడ్గులపల్లిలో అడ్డంకి- నార్కట్‌పల్లి రహదారి వెంట నరికివేసిన హరితహారం చెట్లు

మాడ్గులపల్లి, మే 29 : హరితహారంలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి వాన కాలంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటి శ్రద్ధతో సంరక్షించేది. అయితే ఇప్పుడూ విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయని అధికారులు, సిబ్బంది కొమ్మలను కాకుండా చెట్ల మొదల వరకు నరికివేస్తున్నారు. మాడ్గులపల్లి మండల కేంద్రం లో అడ్డంకి-నార్కట్‌పల్లి రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన వృక్షాలను బుధవారం చెట్టు మొదలు సైతం నరికి వేశారు. దాంతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మొక్కలను సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఖాసీం వివరణ కోరగా రహదారికి ఇరువైపులా నాటిన చెట్లను తొలగించేందుకు పంచాయతీ అనుమతి తీసుకోలేదని తెలిపారు. అనుమతి లేకుండా చెట్లను నరికివేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘర్షణకు దారి తీసిన వాలీబాల్ పోటీలు

- ఇద్దరు యువకులకు గాయాలు

దాడులు చేసుకుంటున్న యువకులు

మిర్యాలగూడ, మే 29 : వాలీబాల్ పోటీల్లో ఇరుజట్ల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటన పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ మండలం చింతపల్లి గ్రామం, దామరచర్ల మండలం దిలావర్‌పూర్‌నకు చెందిన యువకులు ఇటీవల వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మొదట దిలావర్ పూర్ జట్టు గెలుపొందగా రెండోసారి చింతపల్లి జట్టు గెలిచింది. పందెం నగదు పంపిణీ విషయంలో ఘర్షణ జరిగి మొదట దిలావర్ పూర్ జట్టు వారు చింతపల్లి జట్టు యువకులపై దాడి చేశారు. దీన్ని మనసులో పెట్టుకొని దిలావర్‌పూర్‌నకు చెందిన జట్టు సభ్యుడు నవీన్ మిర్యాలగూడ మండల దుకాణంలో పనిచేస్తుండగా అతడిపై రెండు రోజుల క్రితం చింతపల్లి జట్టు యువకులు దాడి చేశారు. అదే సమయంలో మరో యువకుడు రాకేశ్‌పై సైతం దాడి చేశారు. దాడి ఘటనను కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలి

- ఎంపీపీ గంట లక్ష్మమ్మ

శాలిగౌరారం: మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మమ్మ

శాలిగౌరారం, మే 29: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేయాలని ఎంపీపీ గంట లక్ష్మమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా అడుగులు వేయాలన్నారు. వచ్చే వానకాలం సాగులో రైతులు వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ రేఖల లక్ష్మయ్య, డీటీ సత్తార్, అధికారులు పాల్గొన్నారు.

వరిలో పచ్చిరొట్టతో అధిక లాభాలు

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు

త్రిపురారం, మే 29 : వరిలో పచ్చిరొట్ట ఎరువులతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రావు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర, పెసర, గైరిసిడియా వంటి వాటిని రైతులు పంట సాగు చేసే 50 నుంచి 60 రోజుల ముందు పొలంలో చల్లితే భూమికి నత్రజని, భాస్వరం, పొటాషియం, సూక్ష్మధాతువులు నేలకు అందుతాయని పేర్కొన్నారు. దాంతో పంట 30 నుంచి 50 శాతం దిగుబడి పెరుగుతుందని, లెగ్యుమ్ జాతి మొక్కలు కా వడం వల్ల నత్రజని, స్థిరీకరణ జరుగుతుందని, నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, వాన పాముల ఉత్పత్తి పెరుగుతుందని వివరించారు. రైతులు పచ్చిరొట్ట సాగుపై దృష్టి సారించి పంటలో అధిక దిగుబడులు సాధించాలన్నారు.

నేడు జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నల్లగొండ, మే 29 : జిల్లా పరిషత్ సమావేశంలో ఒకటి నుంచి ఏడు స్థాయీ సమావేశాలు గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒకటి గంటల వరకు నిర్వహించనున్నట్లు సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని స్థాయీ సంఘాల చైర్మన్లు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. ఉదయం 10 గంటలకు ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య వైద్యం, పనులపై నిర్వహించ నుండగా..11.30 గంటలకు వ్యవసాయ, మధ్యాహ్నం 12.30 గంటలకు స్త్రీ సంక్షేమం, 1.00 గంటలకు సాంఘిక సంక్షేమ సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు దేవరకొండ మండల సర్వసభ్య సమావేశం

దేవరకొండరూరల్(దేవరకొండ), మే 29 : మండలపరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.సమావేశానికి హాజరయ్యే ఆయా శాఖల మండల అధికారులు తమ శాఖలకు సంబందించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

హాలియా, మే 29 : హాలియా వ్యవసాయశాఖ కార్యాలయంలో సబ్సిడీపై జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఏఓ సరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం హాలియా వ్యవసాయశాఖ వద్ద 196.5 క్వింటాళ్ల విత్తనాలు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.

సకాలంలో యూనిఫామ్స్ సిద్ధం చేయాలి

- అడిషనల్ కలెక్టర్ పూర్ణచంద్ర

మర్రిగూడ: స్కూల్ యూనిఫామ్ కుట్టడాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

మర్రిగూడ,మే 29 : పాఠశాలలు తెరిచే సరికి విద్యార్థులకు యూనిఫామ్స్ సిద్ధం చేయాలని అడిషనల్ కలెక్టర్ పూర్ణ చంద్ర సూచించారు. మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఐకేపీ ఆధ్వర్యంలో కుడుతున్న స్కూల్ యూనిఫారాలను బుధవారం ఆయన డీఈఓ భిక్షపతితో కలిసి పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన కొలతల ప్రకారం నాణ్యతతో ప్రకారం దుస్తులను సిద్ధం చేయాలన్నారు. నిర్లక్ష్యం చేయకుండా పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యాశాఖ,ఐకేపీ అధికారులు మానిటరింగ్ చేయాలని సూచించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలన్నారు. పురోగతిలో ఉన్న పనులను విద్యా సంవత్సరం ప్రారంభం వరకల్లా పూర్తయ్యేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జి.చిన మునయ్య, ఎంఈఓ గురువారావు, ఏపీఎం ప్రభాకర్, ఏపీఓ వెంకటేశం పాల్గొన్నారు.

పాఠశాలలు ప్రారంభం నాటికి యూనిఫామ్ అందజేయాలి

మిర్యాలగూడటౌన్ : పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ కుట్టే శాంతినగర్, ముత్తిరెడ్డికుంటల్లోని కమ్యూనిటీ హాల్‌లను మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ అలీ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పురపాలకసంఘం పరిధిలో 26 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 3,972 మంది విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టిస్తున్నట్లు చెప్పారు. అలాగే సమాఖ్యల పరిధిలో స్త్రీ నిధి బకాయిలు జూన్ 3 లోపు పూర్తిగా చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎర్ర మాద కరుణాకర్, టీఎంసీ బక్కయ్య, సీఓలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మిర్యాలగూడ ముత్తిరెడ్డికుంట కమ్యూనిటీ హాల్‌ను సందర్శించిన మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ అలీ, కరుణాకర్

భూమి కబ్జా చేస్తున్నారని యువకుడి ఆత్మహత్యా యత్నం

- ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరులని ఆరోపణలు
- పోలీసులు పట్టించుకోవడం లేదని యువకుడి ఆవేదన

నార్కట్ పల్లి, మే 29 : తన పట్టా భూములను కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ నార్కట్‌పల్లికి చెందిన జింకల కార్తీక్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. మండలంలోని చిన్న నారాయణపురంలో తన భూమి పక్కనే భూములు ఉన్న వేముల సత్తయ్య, వేముల నర్సింహ దౌర్జన్యంగా తన భూమిలోకి వచ్చి ఆక్రమిస్తున్నారని కార్తీక్ ఆరోపించారు. తన భూమిలోకి కర్ర, గొడ్డలు పట్టు కొని వచ్చి బహిరంగగానే కడీలు పాతారు. ఈ విషయం తెలిసిన కార్తీక్ తన కుటుంబసభ్యులతో కలిసి అక్కడికి గ్రామానికి వెళ్లాడు. వారూ బెదిరింపులకు దిగుతూ కడీలు పాతుతుంటే 100 నంబర్‌కు కాల్ చేశారు. కానిస్టేబుళ్లు వచ్చి కూడా వాళ్లను ఏమీ అనకుండా గొడవ కావట్లేదు కదా అని అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది.ఇంత దౌర్జన్యం జరుగుతున్నా ఎవ రూ పట్టించుకోవడం లేదంటూ కార్తీక్ మనస్తాపంతో తనతో పాటు తెచ్చుకున్న పురుగుల మందు డబ్బాతో సోషల్ మీడియా లో లైవ్ పెట్టాడు. పురుగుల మందు తాగుతుండగా అక్కడే ఉన్న కొందరూ అడ్డుకుని దవాఖానకు తరలించారు. కార్తీక్ ఆరోగ్యానికి ఇబ్బంది లేదని వైద్యులు చెప్పారు. అయితే ఎమ్మె ల్యే వేముల వీరేశం అండతోనే మా భూమిని ఆక్రమిస్తున్నారని, పోలీసులు కూ డా ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని కార్తీక్ ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పోలీసులు స్పందిస్తూ తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పడం గమనార్హం.

డీటీఎఫ్ విద్యా సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

రామగిరి, మే 29: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 31న నిర్వహించే విద్యా సదస్సు పోస్టర్లను బుధవారం నల్లగొండలో ఆవిష్కరించారు. డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య, జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖుర్షీద్ మియా, నల్లగొండ జిల్లా శాఖ పర్వ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జె.వెంకటరాములు ఉద్యోగ విరమణ సందర్భంగా సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. నల్లగొండలోని ఎస్‌బీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే సదస్సుకు ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆవిష్కరణలో జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఖుర్షిద్‌మియా, పి.వెంకులు, నాగయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

త్రిపురారం, మే 29: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2006- 07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సత్కరించారు.
కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తులు

నల్లగొండ, మే 29: వివిధ రంగాల్లో ప్రముఖులకు కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం అందజేసే పద్మ అవార్డులకు సిఫార్సు చేయడానికి గణతంత్ర దినోత్సవం-2025 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని డీఎస్‌డీఓ మక్బూల్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ జిల్లాకు చెందిన వారు రాష్ట్ర జాతీయ స్థాయిలో కళారంగం, సామాజిక సేవ, ప్రజా సేవ, విజ్ఞాన శాస్త్రం, ఇంజినీరింగ్, వ్యాపారం, పరిశ్రమ లు, వైద్య శాస్త్రం, సాహిత్యం, విద్య, క్రీడలు ఇతర రంగాలలో విశేష కృషి చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తాము చేసిన కార్యక్రమాలను 800 పదాలకు మించకుండా www. Padma awards. gov.in వెబ్ సైట్లో నిర్ణీత దరఖాస్తును నింపాలని పేర్కొన్నారు. దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాలతో 3 సెట్లను నల్లగొండలోని జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయంలో జూన్-1, 2024 లోగా పంపాలని వివరించారు.

రేపు ద్విచక్ర వాహనాలకు బహిరంగ వేలం

మిర్యాలగూడ, మే 29: మిర్యాలగూడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో జప్తు చేయబడిన ఐదు ద్విచక్ర వాహనాలను జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశానుసారం శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఉదయం 11గంటలకు ఎక్సైజ్ స్టేషన్‌లో జరిగే వేలంలో పాల్గొనాలన్నారు. వివరాల కోసం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి హామీ కూలీల డబ్బులు వెంటనే చెల్లించాలి

చిట్యాల, మే 29 : ఉపాధి హామీ కూలీల డబ్బులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కత్తుల లింగస్వామి డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలు తమ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏపీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కూలీలకు వారం వారం వేతనాలు చెల్లించేవారని ఇప్పుడు నెలల తరబడి చెల్లించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడిసె లక్ష్మీనారాయణ, జోగు లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆలయ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

సీతారామచంద్ర ఆలయంలో ఎమ్మెల్యే వీరేశం పూజలు

చిట్యాల, మే 29 : మండలంలోని చిన్నకాపర్తి గ్రామ సీతారామచంద్ర ఆలయ 9వ వార్షికోత్సవంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణులు వేదమంత్రాలతో ఆయనకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఉప్పరబోయిన స్వామి, జగతయ్య, వెల్మినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

శాలిగౌరారం : మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన అంబటి రాములు(88)బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం గ్రామానికి చేరుకొని రాములు మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం రాములు కుమారులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం: ఎస్ఐ వీరశేఖర్

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ వీరశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి

త్రిపురారం, మే 29 : క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని ఎస్ఐ కె.వీరశేఖర్ అన్నారు. ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, నిడమనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామెర్ల జానయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ అనుముల వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గట్టు యాదగిరి, కొల్లి రాము పాల్గొన్నారు.

మిర్యాలగూడ వాసికి అంతర్జాతీయ పురస్కారం

అవార్డు అందుకున్న హన్యానాయక్

మిర్యాలగూడటౌన్,మే 29 : మిర్యాలగూడ పట్టణానికి చెందిన హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చ్, ఫెయిత్ బంజారా అనాథాశ్రమ నిర్వాహకుడు హన్యానాయక్‌కు అంతర్జాతీయ ప్లాటినమ్ లీడర్‌షిప్ అవార్డు దక్కింది. డీకే ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన తమిళనాడులోని పెరంబలూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. అవార్డు రావడం పట్ల కుటుంబ సభ్యులు,పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

నకిరేకల్ పట్టణంలో తాళం వేసిన ఇంట్లో చోరీ

నకిరేకల్, మే 29 : నకిరేకల్ పట్టణంలో పటేల్ నగర్‌లోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన నామ నవీన్‌కుమార్ మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌కు వెళ్లారు. రాత్రి 11.10 గంటలకు ఇంటికి చేరుకునే సరికి గేటు, బీరువా తాళం పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న భార్య పుస్తెలతాడు మూడున్నర తులాల బంగారం, మూడు తులాల నెక్లెస్, పాప చెవిదిద్దులు తులం, నాలుగు జతల(48 తులాల) వెండిపట్టీలు, నగదు లాకర్ పగులగొట్టి ట్రాక్టర్ ఈ ఎంఐ కోసం ఉంచిన రూ.94 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడు నవీన్‌కుమార్ ఫి ర్యాదు మేరకు ఎస్ఐ గోపికృష్ణ, నల్లగొండ క్లూస్ టీం సభ్యులు ఆధారాలు సేకరిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేయూత

చిట్యాల, మే 29 : చిట్యాల మున్సిపాలిటీకి చెందిన మంగమ్మ చిరు వ్యాపారం కోసం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం రూ. 10వేలు పంపారు. నగదును ఆ పార్టీ నాయకులు బుధవారం మంగమ్మకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జడల పూలమ్మ, కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు, జడల చినమల్లయ్య,కనకదుర్గ ఆలయ కమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ ఎద్దుల పురి కృష్ణ, వనమా వెంకటేశ్వర్లు, ఏర్పుల పరమేశ్, సిలివేరు శేఖర్, దేశపాక రాజేశ్, జిట్ట భిక్షం పాల్గొన్నారు.

- మూల్ :మండలంలోని చాకలిశేరిపల్లి గ్రామానికి చెందిన పగడాల పెద్దమ్మ ఇటీవల జారి పడడంతో కాలుకు గాయమై హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతుంది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి బుధవారం ఆమెను పరామర్శించి రూ. 5వేలు అందించారు. అలాగే చింతపల్లి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఓరుగంటి యాదయ్య తల్లి నర్సమ్మ మృతి చెందడంతో ఆమె మృతదేహానికి పూలమాల వెసి నివాళులర్పించారు.
- కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన జాగాటి యాదయ్య ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందాడు. దాంతో యాదయ్యతో పాటు పదో తరగతి మిత్రులు బుధవారం రూ.50 వేలు అందజేశారు. సహాయం అందజేసిన వారు వెంకటమ్మ, హనుమంతు, శ్రీనివాస్, అంజయ్య, వెంకటరమణ, చంద్ర శేఖర్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

చిట్యాల: మంగమ్మకు నగదును అందజేస్తున్న నాయకులు

ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలి

- నకిరేకల్ ఏడీఏ రామారావు నాయక్
- జిల్లా వ్యాప్తంగా ఎరువులు, విత్తనాల దుకాణాలు తనిఖీ చేసిన అధికారులు
- పలు మండలాల్లో అధికారుల అవగాహన సదస్సు

శాలిగౌరారంలో మాట్లాడుతున్న ఏడీఏ రామారావు

నార్కట్‌పల్లి, మే 29 : విత్తన డీలర్లు పత్తి విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలని నకిరేకల్ ఏడీఏ రామారావు నాయక్ సూచించారు. నకిలీ విత్తనాల నిర్మూలనపై వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో అధీకృత డీలర్లకు నార్కట్‌పల్లి రైతు వేదికలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మకంలో డీలర్లు పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం ప్రారం భించరాదని, డీలర్లు అమ్మిన విత్తనాల వివరాలను రైతు వారీగా ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేసి ఉంచాలని ఆదేశించారు. స్థానిక ఎస్ఐ అంతిరెడ్డి, ఏఓ గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు రశీదులు తీసుకోవాలి

శాలిగౌరారం : రైతులు పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రశీదు తప్పని సరిగా తీసుకోవాలని ఏడీఏ రామారావు నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించి జీలుగ విత్తనాల పంపిణీని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పీఏసీఎస్‌లో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అవసరం ఉన్న రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఏఓ సౌమ్యశ్రీ, పీసీఏఎస్ సీఈఓ నిమ్మల ఆంజనేయులుగౌడ్ ఉన్నారు.

- పెద్దవూర మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను హాలియా ఇన్‌చార్జి ఏడీఏ సం దీప్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. కంపెనీల ఇన్‌వాయిస్, స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు.

దుకాణాల తనిఖీ

దామరచర్ల/ అడవిదేవులపల్లి/ మర్రిగూడ: తిరుమలగిరి (సాగర్)/ కొండమల్లేపల్లి /నల్లగొండ సిటీ, తిప్పర్తి : దామరచర్ల, అడవిదేవులపల్లి, మర్రిగూడ మండలకేంద్రాల్లో ఎరువుల, విత్తనాల దుకాణాలను ఏఓలు కల్యాణచక్రవర్తి, అర్చన, హేమలత, జాన్‌కీరాములు, వెంకన్న, అమరేందర్‌గౌడ్, సన్నీరాజ్ బుధవారం తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో విత్తనాల స్టాక్ రిజిస్టార్లు, ఇన్‌వాయిస్‌లను, రశీదులను పరిశీలించారు. ఆయా తనిఖీల్లో ఏఈఓలు పాల్గొన్నారు

విత్తనాల కొనుగోలుపై అవగాహన

గుర్రంపోడ్/ త్రిపురారం/ మునుగోడు: / చిట్యాల: వానకాలం సాగు ప్రారంభమవుతున్నందున విత్తనాల కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓలు కంచర్ల మాధవరెడ్డి, పార్వతీ చౌహాన్, శ్రీనివాస్ గిరిబాబు రైతులకు సూచనలు అందించారు. బుధవారం గుర్రంపోడ్ మండలం కొప్పోల్, పిట్టలగూడెం, అమలూర్, చేపూర్,కాల్వపల్లి, మైలాపురం జూనూతుల, త్రిపురారం మండలం రాగడప, పెద్దదేవులపల్లి క్లస్టర్ పరిధిలో ఉన్న హర్జాతండా, పెద్దదేవులపల్లి, మునుగోడు మండలం సింగారం, చల్మెడ, చిట్యాల మండలం వనిపాకల, గుండ్రాంపల్లి, తాళ్ల వెల్లంల, పిట్టంపల్లి గ్రామాల్లో గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. గుర్రంపోడ్ మం డలంలో లైసెన్స్ డీలర్ల వద్ద 12,120 పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.